క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శి మృతి

మైదుకూరు : మండలంలోని వనిపెంట పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న మూరతోటి సుధాకర్ (53) శుక్రవారం మృతి చెందారు. ఐదేళ్ల కిందట దువ్వూరు మండలం మాచన పల్లె పంచాయతీ నుంచి మైదుకూరు మండలానికి సుధాకర్ బదిలీపై వచ్చారు. రెండేళ్లుగా ఆయన మండల ఇన్‌చార్జి ఈఓపీఆర్డీగా పనిచేస్తున్నారు. సుధాకర్ భార్య నందలూరులో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారని, కుమారుడు, కుమార్తె ఉన్నారని మైదుకూరు మండల పరిషత్ పరిపాలన అధికారి నాగేంద్రబాబు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సుధాకర్ మృతి పట్ల ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు, మండల పరిషత్ సిబ్బంది సంతాపం తెలిపారు.

జంప్‌రోప్ పోటీలకు ఎంపిక

మైదుకూరు : మైదుకూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థిని జి.చస్మిత అంతర్జాతీయ జంప్‌రోప్ పోటీలకు ఎంపికైంది. మహారాష్ట్రలోని నాసిక్‌లో గురు, శుక్రవారాల్లో జరిగిన అండర్–11 జాతీయ జంప్ రోప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున పాల్గొన్న చస్మిత డబుల్ హ్యాండర్, సైక్లింగ్ విభాగాల్లో రన్నరప్‌గా నిలిచి వెండి పతకాన్ని సాధించింది. ఏప్రిల్‌లో జపాన్‌లో జరిగే అంతర్జాతీయ జంప్ రోప్ పోటీలకు ఈ విద్యార్థిని ఎంపికైంది. జాతీయ పోటీల్లో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీలకు తమ కుమార్తె ఎంపిక కావడం పట్ల మండలంలోని మిట్టమానుపల్లెకు చెందిన చస్మిత తల్లిదండ్రులు విజయలక్ష్మి, రవి కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

కంటి అద్దాలు పంపిణీ

మైదుకూరు : మైదుకూరులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. ముందుగా విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి 60 మందికి అద్దాలు అవసరమని గుర్తించారు. ప్రభుత్వం ఉచితంగా అందించిన కంటి అద్దాలను డిప్యూటీ డీఎంహెచ్ఓ మల్లేష్, కృష్ణాపురం అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి సుమధుర, ఆప్తాలమిక్ అధికారి చంద్రమౌళి 60 మంది విద్యార్థులకు కంటి అందాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.భవాని దేవి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ నిర్మించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్ తెలిపారు. విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని పొందుపరిచారన్నారు. ప్రధాని మోదీ తిరుపతిలో వెంకన్న సాక్షిగా ఉక్కు పరిశ్రమ నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా ఉక్కు పరిశ్రమను నిర్మించి నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు ఓబులేసు, మోహన్, ప్రదీప్ పాల్గొన్నారు.

ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలి

దువ్వూరు : మండలంలోని ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని మండల వ్యవసాయాధికారి అమరనాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని భూమి గల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకురావడం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయశాఖ ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. రైతు గుర్తింపు సంఖ్య అనేది రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసిన తర్వాత భూమి గల ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య ఇస్తారన్నారు. రైతు ఆధార్ నంబర్, ఆధార్ అనుసంధానిత ఫోన్ నంబర్, భూమి రికార్డుల వివరాలు పట్టదారు పాస్‌పుస్తకం, ఈమెయిల్ ఐడీతో రైతులు గ్రామంలోని రైతు సేవా కేంద్రం సిబ్బందిని కలిసి విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని తెలిపారు.

చెట్లు నరికివేత

మైదుకూరు : స్థానిక కేసీ కాలువ కొండ పేట ఛానల్ కట్టపై జోసెఫ్ పేట ప్రాంతంలో ఉన్న కొందరు వ్యక్తులు చెట్లను నరికి వేశారు. కట్టపై ఉన్న చెట్లను నరికి కొందరు అమ్ముకుంటున్నారని జోసెఫ్ పేట వాసులు తెలిపారు. దీనిపై అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. కేసీ కాలువ కట్టపై చెట్లను నరికి వేయడంపై కేసీ డీఈఈ పుల్లయ్య దృష్టికి తీసుకెళ్లేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా, ఆయన అందుబాటులోకి రాలేదు.

విద్యార్థుల ప్రతిభ

బద్వేలు అర్బన్ : డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు కళాశాల పరిపాలనాధికారి రాచపూడి సాయికృష్ణ తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మొత్తం 13 గ్రూపులకు గాను 12 గ్రూపుల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థులే యూనివర్సిటీ ఫస్ట్‌గా నిలిచారన్నారు. అన్ని గ్రూపుల నుండి మొదటి సెమిస్టర్‌లో 11 మంది విద్యార్థులు పదికి పది పాయింట్లు సాధించగా 50 మందికి పైగా విద్యార్థులు 9.0 జీపీఏ పైన సాధించారన్నారు. మంచి మార్కులు సాధించి కళాశాలకు కీర్తిప్రతిష్టలు తెచ్చిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన అధ్యాపకులను ఆయన అభినందించారు. ప్రిన్సిపల్ సత్యనారాయణ, బాలఓబులేసు, అశోక్, లక్ష్మీదేవి, రాధ, షాహిన, రామసుధ తదితరులు పాల్గొన్నారు.

• జొన్న నూర్పిళ్లలో బిజీబిజీ



నూర్పిడికి సిద్ధంగా ఉన్న జొన్న కంకులు (ఇన్‌సెట్) జొన్నలు

జొన్న సాగు చేసిన రైతులు పంటకోత, కంకుల కోత, నూర్పిళ్లు, తూకాలు వేయడంలో బిజీబిజీగా ఉన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు ఈ పంటను సాగుచేశారు. అయితే పురుగు ఆశించడంతో వేలాది రూపాయలు ఖర్చు చేసి గుళికలు, మందులను పిచికారీ చేశారు. ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా 10 నుంచి 15 క్వింటాళ్ల లోపే వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వింటా రూ.2100 నుంచి రూ.2200 వరకు పలుకుతున్నట్లు రైతన్నలు చెప్పారు. – రాజుపాళెం

పశు వైద్య విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలి

ప్రొద్దుటూరు : పశు వైద్య విద్యార్థులకు స్టైఫండ్‌ను పెంచాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గోపవరం వద్ద పశు వైద్య కళాశాలలో విద్యార్థుల నిరవధిక సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ 2013 నుంచి పశు వైద్య విద్యార్థులకు స్టైఫండ్ రూ.7 వేలు ఇస్తున్నారని, పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రూ.26 వేలకు పెంచాలని తెలిపారు. పశు వైద్య విద్యార్థుల సంఘాన్ని చర్చలకు మంత్రి అచ్చెన్నాయుడు పిలవడాన్ని ఏపీ రైతు సంఘం అభినందిస్తోందన్నారు. బడ్జెట్‌లో వీరికి నిధులు కేటాయించాలన్నారు. ప్రతి ఏడాది ప్రభుత్వానికి పాడి పరిశ్రమ ద్వారా రూ.60 వేల కోట్ల ఆదాయం వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి పీటర్, సహాయ కార్యదర్శులు వాసు, రాహుల్ పాల్గొన్నారు.



పశు వైద్య విద్యార్థుల సమ్మెకు మద్దతు తెలిపిన ఏపీ రైతు సంఘం, సీపీఐ నాయకులు

పశువైద్య విద్యార్థులకు శుక్రవారం డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్ మద్దతు తెలిపారు. పశువైద్య విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేరీ కుమార్, విశ్వనాథ్, నాయకులు జగదీష్, వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దువ్వూరు : మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ వీరారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడిపాడు గ్రామంలోని 132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని అన్ని విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ వేణుగోపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దువ్వూరు మండలం గుడిపాడు గ్రామం వద్ద గల 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు జరుగుతున్నందున శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

తపాలా శాఖ ప్రైవేటీకరణ సరికాదు

ప్రొద్దుటూరు కల్చరల్ : తపాలా శాఖ ప్రైవేటీకరణ(కార్పొరేట్) నిర్ణయం సరికాదని ఎఫ్ఎన్‌పీఓ సర్కిల్ సెక్రటరీ డేవిడ్‌రాజు తెలిపారు. స్థానిక హెడ్ పోస్టాఫీసు వద్ద ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్టల్ ఉద్యోగులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ యూనియన్లు కలిసి జేఏసీగా ఏర్పడి తపాల శాఖను కాపాడుకోవడానికి పోరాడుతున్నాయన్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన చేస్తున్నట్లు తెలిపారు. ఐడీసీ, ఎన్‌డీసీ, సీడీసీలు అని పేర్లు పెట్టి పోస్ట్‌మెన్లందరినీ డిపార్ట్‌మెంట్‌కు దూరంగా ఉంచాలన్న ఆలోచన దుర్మార్గమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుశంకర్, జిలానీ బాషా, జయన్న, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



హెడ్ పోస్టాఫీసు వద్ద నిరసన తెలుపుతున్న పోస్టల్ ఉద్యోగులు

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీరాములపేట ఉపాధ్యాయ సేవా కేంద్రంలో దామోదరం సంజీవయ్య జయంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య రెండో సీఎంగా 38 ఏళ్ల వయసులోనే పదవి చేపట్టారన్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆయన ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో యడవల్లి రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర మాలమహానాడు కార్యాలయం ప్రారంభం

ప్రొద్దుటూరు : స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఎస్ఎస్ మాల్‌లో శుక్రవారం రాష్ట్ర మాలమహానాడు (రామాజి వర్గం) జాతీయ కార్యాలయాన్ని జాతీయ అధ్యక్షుడు రామాజీ ఇమ్మానుయేల్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత, బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపాక వినోద్ కుమార్ మాట్లాడుతూ దళిత, బడుగు, బలహీనవర్గాల కోసమే ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర సోషల్ మీడియా అధ్యక్షుడు ఆకుమల్ల ప్రణయ్ కుమార్, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సుద్దపల్లి మురళీప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరమణ, రాష్ట్ర సమన్వయకర్త మేకల ఓబులేసు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఉల్లి కిరణ్ కుమార్, రాయలసీమ అధ్యక్షుడు చంద్రశేఖర్, రాయలసీమ సోషల్ మీడియా అధ్యక్షుడు సీకే కుమార్, రాయలసీమ కార్యదర్శి అరుణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు సంగటి పుల్లయ్య, నంద్యాల జిల్లా సెక్రటరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఇమ్మానుయేల్

వీర జవానులకు ఘన నివాళి

ప్రొద్దుటూరు కల్చరల్ : పుల్వామ ఘటనలో వీరమరణం పొందిన జవానులకు వేంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. 2019 ఫిబ్రవరి, 14న పుల్వామాలో జరిగిన ఈ ఘటనను బ్లాక్ డేగా జరుపుకొంటున్నామని కళాశాల ప్రిన్సిపల్ ముస్తాఫా తెలిపారు. ఈ దుర్ఘటనలో 40 మంది జవానులు వీర మరణం పొందారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శారదభవాని, ఎన్‌సీసీ ఆఫీసర్లు దావీద్, నరసింహ, కో ఆర్డినేటర్ గౌరీశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : కంటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, వైఎంఆర్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ హిమబిందు తెలిపారు. ఆప్తాల్మిక్ ఆఫీసర్ కేజే రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థినులకు శుక్రవారం ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ కంటి ఆరోగ్యం కోసం విటమిన్ ఎ ఎక్కువగా ఉండే పండ్లు, ఆకు కూరలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, మనోహర్ నాయుడు, సుబ్బారెడ్డి, ఏఎన్ఎం పాల్గొన్నారు.

కక్షగట్టి.. అక్రమ కేసులు పెట్టి..

చాపాడు : వైఎస్సార్‌సీపీ వర్గీయుడిని అనే కారణంతో కక్షగట్టిన టీడీపీ నాయకులు ఒత్తిడితో.. తాను నిర్వహిస్తున్న చౌకదుకాణంపై అధికారులు అక్రమ కేసులు పెడుతున్నారని మండలంలోని మదూరుకు చెందిన ఎస్.రామిరెడ్డి ఆరోపించారు. శుక్రవారం రామిరెడ్డి మాట్లాడుతూ 35 ఏళ్ల క్రితం నుంచి మదూరులోని 1114028 చౌక దుకాణం డీలర్‌గా నిత్యావసర సరుకులు రేషన్ కార్డు దారులకు పంపిణీ చేస్తున్నానని, ఎప్పుడూ తన షాపుపై ఎలాంటి కేసులు నమోదు కాలేదన్నారు. గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మూడు నెలల క్రితం ప్రొద్దుటూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చౌక దుకాణం తనిఖీ చేసి.. అన్ని వివరాలు, రికార్డులు సక్రమంగా ఉన్నప్పటికీ 6ఏ కేసు నమోదు చేశారని తెలిపారు. దీనిపై కోర్టుకు వెళ్లగా కోర్టు స్టే విధించిందన్నారు. దీంతో ఈ నెలలో సరకులను పంపిణీ మొదలుపెట్టానని వివరించారు. మళ్లీ ఈ నెల 11న విజిలెన్స్ అధికారులు చౌక దుకాణం తనిఖీకి వచ్చారని, చౌకదుకాణం తెరిపించి కనీసం డీలర్ అయిన తనను కూడా లోపలికి రాకుండా సరకులను పరిశీలించి 6 ఏ కేసు నమోదు చేశారని వాపోయారు. కేసు ఎందుకు నమోదు చేస్తున్నారో చెప్పలేదని, కనీసం పంచానామా రిపోర్టు కూడా ఇవ్వలేదన్నారు. ఐదు రోజులుగా మండల తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా కేసు వివరాలకు సంబంధించిన నివేదిక ఇవ్వలేదని తెలిపారు. రాజకీయ కక్షతో టీడీపీ నాయకుల ఒత్తిడి వల్ల ప్రభుత్వ అధికారులు చౌక దుకాణ నిర్వహణపై అక్రమ కేసులు పెట్టారని, తాను మళ్లీ కోర్టుకు వెళ్లకూడదనే ఉద్దేశంతోనే కేసు వివరాల నివేదిక ఇవ్వడం లేదని రామిరెడ్డి వాపోయారు.



డీలర్ రామిరెడ్డి

పరీక్షా సామగ్రి పంపిణీ

చాపాడు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల బాలికల పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ బిజివేముల ఉమామహేశ్వరి, నాగేశ్వర్ రెడ్డి కూతురు శ్రీతేజసాయి నాగ చరిత జన్మదినం సందర్భంగా కస్తూర్బాలో చదువుకుంటున్న పది, ఇంటర్‌లకు చెందిన 89 మంది విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను అందించామన్నారు. శ్రీధర్‌రెడ్డి, కస్తూర్బా ఎస్ఓ నాగలక్ష్మి,పాతకోట శ్రీనివాసరెడ్డి, రాజశేఖరరెడ్డి, పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

మహా శివరాత్రి కరపత్రాల ఆవిష్కరణ

చాపాడు : మండల పరిధిలో ముఖ్య పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి సన్నిధిలో శుక్రవారం మహా శివరాత్రి ఉత్సవాలను సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 26, 27వ తేదీల్లో మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ఈఓ శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు వీరనారాయణ యాదవ్ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. శివరాత్రి రోజున జాగరణకు వచ్చే వేలాది మంది భక్తుల కోసం వివిధ రకాలైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఆలయ ఈఓగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులును ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఘనంగా సన్మానించారు. కమిటీ సభ్యులు వీరారెడ్డి, అర్చకులు చిన్నస్వామి, గోవింద స్వామి తదితరులు పాల్గొన్నారు.



శివరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

నేడు స్వచ్ఛ ఆంధ్రాను జయప్రదం చేయండి

పోరుమామిళ్ల : ప్రభుత్వం ప్రతి మూడవ శనివారం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమాన్ని అందరూ జయప్రదం చేయాలని ఎంపీడీఓ రమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది, కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు, ఉపాధి సిబ్బంది సంయుక్తంగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన పిలుపిచ్చారు. ప్రతి ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేరుచేయడం గురించి వివరించాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి, మానవహారం చేపట్టాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పూర్తి స్థాయిలో పని చేసే విధంగా చూడాలన్నారు. వర్మీ కంపోస్టు తయారికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు.

గ్రామీణ బ్యాంకు సేవలను వినియోగించుకోండి

దువ్వూరు : మండలంలోని ప్రజలందరూ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సుశాంత్ కుమార్ స్వారో తెలిపారు. శుక్రవారం దువ్వూరులోని ఏపీజీ బ్యాంక్‌ను ఆయన సందర్శించి వినియోగదారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సేవలను వినియోగించుకుని బ్యాంకు అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. మండలంలో దువ్వూరు, గుడిపాడు, కానగూడూరు గ్రామాల్లో ఏపీజీబీ బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. ఏపీజీబీలో త్వరలో మూడు బ్యాంకులు విలీనం కానున్నాయని, ఈ బ్యాంకుల విలీనం జరిగితే ఏపీజీబీ అతిపెద్ద గ్రామీణ బ్యాంకుగా అవతరిస్తుందన్నారు. గ్రామాల్లో భూ సర్వే జరుగుతుండటం వల్ల రైతుల భూములు ఆన్‌లైన్‌లో లేకపోవడంతో క్రాప్ రుణాలను రెన్యువల్ చేసుకోలేకపోతున్నారని, ఈ సమస్యపై రెవెన్యూ అధికారులు స్పందించి రైతులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మొండి బకాయిల కోసం గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని, ఈ సమావేశాల్లో ప్రజలు, అధికారులు, రాజకీయ నాయకులు పాల్గొని బకాయిల వసూలుకు సహకరించాలని కోరారు. ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలను మంజూరు చేస్తోందని, అర్హులైన వారికి బ్యాంకు ద్వారా సబ్సిడీ రుణాలను అందిస్తామన్నారు. దువ్వూరు ఏపీజీబీ శాఖలో ఇప్పటి వరకు రూ.86 కోట్లు వ్యాపారం జరిగిందని, ఇందులో రూ.33 కోట్లు డిపాజిట్లు, రూ.53 కోట్లు అడ్వాన్స్‌లు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీ బ్రాంచ్ మేనేజర్ రమణ, అసిస్టెంట్ మేనేజర్ అమూల్య, ఫీల్డ్ ఆఫీసర్ ప్రియాంక, క్యాషియల్ మేరి విశాలి, సిబ్బంది ప్రతాప్ రెడ్డి, కిశోర్, మహబూబ్‌పీరా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీజీబీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సుశాంత్ కుమార్

హెల్మెట్ భారం కాదు... భరోసా

బద్వేలు అర్బన్ : హెల్మెట్ భారం కాదు ... భరోసా అని, ఇందుకోసం ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి నిండు జీవితాన్ని కాపాడుకోవాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు, బద్వేలు అర్బన్ ఎస్ఐ ఎం.సత్యనారాయణ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఎంవీఐ కార్యాలయం నుండి సిద్దవటం రోడ్డు, మైదుకూరు రోడ్డు, నెల్లూరు రోడ్డుల మీదుగా పట్టణంలో హెల్మెట్‌లు ధరించి బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంవీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో అధికశాతం యువత ప్రాణాలు కోల్పోతున్నారని, ఇందుకు కారణం వాహనాలను నడిపే సమయంలో హెల్మెట్ ధరించకపోవడమే అన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో తలకు గాయం కాకపోతే సాధ్యమైనంత వరకు ప్రాణాపాయం తప్పుతుందన్నారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం వలన సురక్షితంగా గమ్యం చేరుకోవచ్చనే విషయాన్ని ప్రతి వాహనదారుడు గుర్తించుకోవాలన్నారు. అలాగే అతి వేగం కూడా ప్రమాదాలకు మూలకారణమని, దీనిని నియంత్రించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు స్వస్తి పలికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంవీఐ కార్యాలయ సిబ్బంది, వివిధ ద్విచక్ర వాహన షోరూమ్‌ల సిబ్బంది పాల్గొన్నారు.



హెల్మెట్ ధరించి బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న ఎంవీఐ, ఎస్ఐ, సిబ్బంది

ఆ సంఘంతో సంబంధం లేదు

ప్రొద్దుటూరు : ఆంధ్ర ప్రదేశ్ దేవాంగ సంక్షేమ సంఘంతో ఎలాంటి సంబంధం లేదని ది ప్రొద్దుటూరు దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనం పేర్కొన్నారు. దేవాంగ కల్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ 8న రాజమండ్రిలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం సమన్వయ సమావేశం అని ప్రచారం చేశారన్నారు. కార్యవర్గ సభ్యులతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండా, పాలక వర్గాన్ని రద్దు చేయకుండా రాష్ట్ర అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యేశ్వరరావు, కార్యదర్శిగా మాడిశెట్టి శివశంకరయ్యలను ఎన్నుకున్నారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన ది ప్రొద్దుటూరు దేవాంగ సంక్షేమ సంఘంతో సంప్రదింపులు జరపకుండా ఈ నెల 16న జరిగే ప్రమాణ స్వీకారానికి గౌరవ అతిథులుగా ప్రచురించారన్నారు. తమకు తెలియకుండా సంఘం పేరును వాడుకోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో దేవాంగ కల్యాణ మండపం అధ్యక్షుడు రెడ్డి చంద్రశేఖర సుబ్రహ్మణ్యం, కార్యదర్శి మచ్చా వెంకటసుబ్బరాయుడు, కోశాధికారి వెంకటచలపతి, దేవాంగ సంక్షేమ సంఘం సెక్రటరీ గిద్దలూరు ఈశ్వరయ్య, కోశాధికారి కాటం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వుట్టి నాగశయనం

24న భవన నిర్మాణ కార్మికుల నిరసన

ప్రొద్దుటూరు : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కడప కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ నెల 24న నిరసన తెలుపుతున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం(ఏఐటీయూసీ) ఏరియా కార్యదర్శి పూసల చిన్న ఓబన్న తెలిపారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ఏరియా సమితి ముఖ్య కార్యకర్తల సమావేశం ఏరియా అధ్యక్షుడు సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిన్న ఓబన్న మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని చెప్పి ఇంత వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న 42వేల క్లెయిమ్‌లు పరిష్కరించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. 50 ఏళ్లు నిండిన కార్మికులకు రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలన్నారు. కలెక్టరేట్ వద్ద ఈ నెల 24న చేపట్టే నిరసనలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శేషారెడ్డి, సుబ్బరాయుడు, కుమార్, ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పూసల చిన్న ఓబన్న

జిల్లా ఆస్పత్రి ఆవరణలో ఆందోళన

ప్రొద్దుటూరు క్రైం : ఆస్పత్రికి వచ్చిన రోగులకు స్కానింగ్ రాయకుంటే వ్యాధి నిర్ధారణ ఎలా జరుగుతుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. సిటీ, ఎంఆర్ఐ స్కానింగ్‌లో జాప్యాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ 2018లో జిల్లా ఆస్పత్రిలో సిటీ, ఎమ్మార్ఐ విభాగాలను ఏర్పాటు చేశారన్నారు. జాయింట్ కమిషనర్ జిల్లా ఆస్పత్రికి వచ్చి వెళ్లిననాటి నుంచి వైద్యులు స్కానింగ్ రాయడం లేదన్నారు. పాత పద్ధతిలోనే స్కానింగ్ రాయకుంటే జిల్లా వ్యాప్త ఆందోళనకు పిలుపునిస్తామని హెచ్చరించారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. విజయ్‌కుమార్, రాఘవ, రవికుమార్, రవి, బాబు, బాబసుబ్బయ్య పాల్గొన్నారు.



జిల్లా ఆస్పత్రిలో నిరసన చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఈ నెల 22 నుంచి ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభలు

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.ఈశ్వరయ్య

చాపాడు : ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి గ్రామానికి తాగునీటి సాధనకై ఈ నెల 22 నుంచి 24వ వరకూ కడపలో నిర్వహించనున్న రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రాజెక్టుల ప్రాంతీయ మహా సభలను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. మండలంలోని పల్లవోలు గ్రామానికి చెందిన సీనియర్ రైతు సంఘం నాయకులు గజ్జల బాల చెండ్రాయుడును శుక్రవారం ఈశ్వరయ్య కలసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య విలేకరులతో మాట్లాడుతూ అంతఃరాష్ట్ర నీటి వివాదాల చట్టం 1956 ప్రకారం ఏర్పాటైన బచావత్ ట్రిబ్యునల్ కృష్ణానీటిలో 75శాతం నీటి లభ్యత ఆధారంగా 2,130 టీఎంసీలుగా లెక్కగట్టి మహారాష్ట్రకు 585 టీఎంసీలు, కర్నాటకకు 734 టీఎంసీలు, ఉమ్మడి ఏపీకి ప్రాజెక్టుల వారీగా 811 టీఎంసీలలో రాష్ట్ర విభజనాంతరం తెలంగాణకు 260.43టీఎంసీలు కేటాయించారని తెలిపారు. అలాగే కోస్తాంధ్రకు 366.87 టీఎంసీలు, రాయలసీమకు 133.77టీ ఎంసీలు (ఇందులో కేసీ కెనాల్‌కు 39.9, తుంగభద్రలో లెవల్ కెనాల్‌కు 29.5, హై లెవల్‌కు 32.5, బైరవాని తిప్పకు 4.9, గాజులదిన్నె 2.0, మైనర్ ఇరిగేషన్‌కు 13.9 టీఎంసీల చొప్పున 122.7టీఎంసీలు కేటాయించగా, కేసీ కెనాల్ ఆధునీకరణ ద్వారా 11టీఎంసీలు, పునరుత్పత్తి ద్వారా 8టీఎంసీలు కలిపి మొత్తం 19టీఎంసీలు శ్రీశైలం కుడి కాల్వ ఎస్ఆర్‌బీసీ)కి కేటాయించిందన్నారు. తుంగభద్ర నుంచి కేసీ కెనాల్‌కు రావాల్సిన 10 టీఎంసీలు పోతిరెడ్డిపాడు ద్వారా చివరి ఆయకట్టుకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించి సర్దుబాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్, ప్రజా నాట్య మండలి రాష్ట్ర నాయకులు పల్లవోలు రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈశ్వరయ్య

కృష్ణా నదీ యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు : కృష్ణా నదీ యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటుచేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ బోర్డును విజయవాడలో ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఉత్తరం పంపడం దారుణమన్నారు. కేఆర్ఎంబీని కర్నూలులో ఏర్పాటుచేయాలని రైతు సంఘాల నాయకులు, నీటి పారుదల నిపుణులు, రైతులు కోరుతుంటే ఇలా చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం తొమ్మిది నెలల్లో రైతులకు సంబంధించిన ఏ ఒక్క పథకాన్ని అమలు చేయలేదన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌కు కేంద్ర మంత్రి అమిత్‌షా రూ.3 లక్షల కోట్లు ఇచ్చామని చెబుతున్నారని, ఆ డబ్బు ఎక్కడికిపోయిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాయలసీమలో నీటి ప్రాజెక్టులకు సంబంధించి పూర్తి స్థాయిలో డిస్ప్రాచ్ కెనాల్స్ నిర్మించకుంటే చెరువులు, కుంటలకు నింపుకొనే పరిస్థితి ఉండదన్నారు. కడప రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22, 23, 24వ తేదీల్లో ప్రాజెక్టుల మహా సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.